వానాకాలం సాగుకు సమాయత్తం

- ముమ్మరంగా సాగుతున్న వ్యవసాయ పనులు
- విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతుల వేడుకోలు


వేణుగోపాలపురం వద్ద పత్తి విత్తనాలు నాటేందుకు దుక్కి సిద్ధం చేస్తున్న రైతు


బృందావనపురం సమీపంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

నడిగూడెం : నైరుతి రుతుపవనాలు రావడం, వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఈ ఏడాది సకాలంలో వచ్చిన నైరుతి రుతుపవనాలు జూన్ నెల ఆరంభంలో మండల వ్యాప్తంగా బాగా ప్రభావం చూపుతున్నాయి. గత నాలుగైదు రోజులుగా రోజంతా పగటి సమయంలో కొంత ఉష్ణోగ్రత ఉండగా, సాయంత్రం కాగానే జల్లులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు ఈ వర్షాలు తోడయ్యాయి. దీంతో రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. వేసవి దుక్కులు సిద్ధం చేసుకోవడం, పలు మెట్ట పంటలు విత్తనాలు విత్తే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పలు గ్రామాలకు చెందిన రైతులు ముందుగానే విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు.

దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు..

మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆయకట్టు రైతులతో పాటు, నాన్ ఆయకట్టు రైతులు భూముల్లోకి పశువుల పెంట, చెరువు మట్టి తోలుకుంటున్నారు. అలాగే వేసవి దుక్కులు దున్నుకుంటున్నారు. నడిగూడెం, బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, వెంకట్రాంపురం, కరివిరాల, నారాయణపురం, కాగితరామచంద్రాపురం, సిరిపురం, శ్రీరంగాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, రామాపురం, తెల్లబల్లి గ్రామాలలో పత్తి, కంది, పెసర, సాగుకు సన్నద్ధమవుతూ విత్తనాలు విత్తుతున్నారు. అలాగే వరి సాగు చేయాలనుకొనే రైతులు స్థానికంగా, పలు పరిశోధనా స్థానాల నుంచి విత్తనాలు తెచ్చుకుంటున్నారు. ఇంకా పలువురు రైతులు జీలుగ విత్తనాలు విత్తుతున్నారు.

ఈ ఏడాది భిన్న పరిస్థితి..

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉన్నది. గత ఏడాది వానాకాలంలో కొద్ది పాటి జల్లులతో కూడిన వర్షాలు కురిసి ముఖం చాటేశాయి. దీంతో సాగు నీటి కోసం రైతులు నానా కష్టాలు పడ్డారు. సరైన వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. పంటలు సరిగ్గా పండక సాగు తగ్గింది. కానీ ఏడాది అలా కాకుండా వానాకాలం సీజన్ ఆరంభం నుంచే మంచి వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటలు సంవృద్ధిగా పడుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని మండల రైతులు కోరుతున్నారు.

4ఎకరాల పత్తిసాగుకు సన్నద్ధమవుతున్నా



గత ఏడాది కన్నా ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు త్వరగా రావడంతో వర్షాలు కూడా అనుకూలంగా కురుస్తున్నాయి. దీంతో నాకున్న నాలుగు ఎకరాలలో పత్తి సాగుకు సన్నద్ధమవుతున్నాను. వేసవి దుక్కులు పూర్తయి, విత్తనాలు నాటే పనులు చేసుకుంటున్నాము.

– బోయిళ్ల రామయ్య, పత్తి రైతు, వేణుగోపాలపురం

11న శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణం


పూజలందుకుంటున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి


విద్యుత్ వెలుగుల్లో తిరుపతమ్మ ఆలయం

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం పరిధిలోని హుజూర్‌నగర్–మట్టపల్లి ప్రధాన రహదారిపై త్రివేణినగర్ వద్ద భక్తుల కొంగుబంగారమై వెలసిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి కల్యాణాన్ని ఈనెల 11న నిర్వహించేందుకు ఆలయ పాలక వర్గం, భక్తులు, గ్రామ పెద్దలు ఆలయాన్ని విద్యుత్ వెలుగుల్లో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణాన్ని కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ దేవాలయం అర్చకులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిఏటా శ్రీతిరుపతమ్మ గోపయ్యస్వాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిలువేరు నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది మరింతంగా భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా దాతల సహకారంతో వేలాదిమంది భక్తులకు అన్నదానం చేయనున్నామన్నారు.

హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి

కోదాడ : ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ కోదాడ మండల అధ్యక్షుడు బడుగుల సైదులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ప్రకటించిన విధంగా 10వేల ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలన్నారు. అదే విధంగా ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల విషయంలో పారదర్శకత పాటించి ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని కోరారు. ప్రతి పాఠశాలలో స్వీపర్, స్కావెంజర్‌ను నియమించాలని, ఉచిత పుస్తకాలు, దుస్తులను సకాలంలో అందజేయాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగించాలని, ఉపాధ్యాయులకు ఈ పనుల నుంచి విముక్తి కల్పించాలన్నారు.

క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల అమ్మకాన్ని నిషేధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

చిలుకూరు : ప్రైవేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాల అమ్మకాన్ని తక్షణమే నిషేధించాలని టీఎస్ఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్టా నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, డ్రెస్‌ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సరీలకు కూడా ఫీజులు వేలల్లో ఉంటున్నాయని, ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజు నుంచి పాఠశాలలో దాడులు నిర్వహించి అక్రమ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీఎస్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విరాళాలు అందజేత

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న సీతారామ కల్యాణ మండపం నిర్మాణానికి పలువురు దాతలు ముందుకొచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నడిగూడెం మాజీ సహకార సంఘం చైర్మన్ పుట్టా రమేష్ 100 బస్తాలు సిమెంట్ అందజేయగా, నడిగూడెం గ్రామానికి చెందిన నకిరెకంటి నర్సింహారావు రూ.10,116, బీరవల్లి శ్రీనివాసరెడ్డి 10,116, పందిరి వెంకట్రామ నర్సిరెడ్డి రూ.22,116 విరాళాలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భౌరిశెట్టి వెంకటరత్నం, సభ్యులు కొండా వెంకన్న, భోనగిరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 40రోజుల మజ్జిగ పంపిణీ కార్యక్రమం


మజ్జిగ పంపిణీ చేస్తున్న క్లబ్‌ల సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలో వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రం వద్ద పులిహోర, దద్దోజనం, మజ్జిగ వంటి ఉచిత సేవా కార్యక్రమాలు ఆదివారం నాటికి 40వరోజుతో ముగిసింది. ఈ వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి క్లబ్ సభ్యుల పెళ్లి రోజులు, పుట్టిన రోజుల సందర్భంగా పేదలకు సేవలను అందించేందుకు మజ్జిగ పంపిణీకి శ్రీకారం చుట్టి అందించినట్లు క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాచకొండ రాంమోహన్‌రావు, జోన్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, వాసవీ, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గెల్లి నర్సింహారావు, లక్ష్మీప్రసన్న, జూలూరు అశోక్, చెరుకు కవిత, తాళ్లూరి శ్రీనివాస్, సోమప్ప దేవాలయం మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, గోళ్ల సుధాకర్, నటరాజ్, పరమేశం, పాల్వాయి గోపాలకృష్ణ వాసు, రాము, మధు, రవికుమార్, కందిబండ శ్రీనివాస్, చందా కిషన్, ఓరుగంటి శ్రీనివాస్, రమేష్ తదితరులున్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

హుజూర్‌నగర్ : విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని విద్యాసంస్థలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూ పేర్లతో ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మఠంపలి : హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురంలో ఈనెల 11న నిర్వహించే సీపీఎం నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, మండల కార్యదర్శి బాలునాయక్, రస్మియా, రాము, కోటయ్య, తదితరులున్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


చిలుకూరు : బడిబాట ర్యాలీలో పాల్గొన్న హెచ్‌ఎం వెంకయ్య, ఉపాధ్యాయులు


నేరేడుచర్ల : శాంతినగర్‌లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చిలుకూరు : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని హెచ్‌ఎం కొండా వెంకయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రామ్‌నగర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు వీరబాబు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో స్థానిక ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆదివారం ఇంటింటికి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల తల్లిదండ్రులను నేరుగా కలిసి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక వసతులపై వివరించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బట్టు మధు, శాంతినగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కందిబండ అనసూయ మాట్లాడారు. ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో మెరుగైన విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, పోషకాహారాలతో కూడిన మధ్యాహ్న భోజనం, రాగిజావ వంటి సౌకర్యాలు పాఠశాలల్లో కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదులు, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, నరసింహ్మారావు, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

నోటు పుస్తకాల పంపిణీ అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న కోటిరెడ్డి

మునగాల : విద్యార్థులకు దాతలు నోటు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని గ్రామ వాసి, వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కొనుగంటి రామరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారులు కోనుగంటి వీర్రాజు, వెంకటరాజులు గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.50వేల విలువగల నోటు పుస్తకాలను నంద్యాల కోటిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలను కోటిరెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నోటు పుస్తకాల దాతలు, ఎంపీపీ ఎలక బిందు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగమణి, పాఠశాల హెచ్‌ఎం నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఉద్యోగ సమాఖ్య సభ్యులు, గ్రామపెద్దలు ఎలక నరేందర్‌రెడ్డి, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా గట్టు మైసమ్మ జాతర

మోతె : మండల పరిధిలోని ఉర్లుగొండ గ్రామంలో ఆదివారం గట్టు మైసమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో టీపీసీసీ డెలిగెట్ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గట్టు మైసమ్మ తల్లి కృపతో ఉర్లుగొండ గ్రామస్తులు, భక్తులు ఆనందంగా ఉండాలని, కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు తీరే విధంగా వర్షాలు సమృద్ధిగా కురువాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కోదాడ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ పుల్లారావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ మైనంపాటి గుర్వారెడ్డి, కేఎల్ఎన్ ప్రసాద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య, మామిడి వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా కల్వర్టు నిర్మాణ పనులు


కాల్వపల్లితండా సమీపంలో నిర్మాణం చేస్తున్న కల్వర్టు

మఠంపల్లి : మండలంలోని కాల్వపల్లితండా సమీపంలో రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంపీ నిధుల నుంచి మంజూరు చేసిన రూ.8లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన కల్వర్టు నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పనులను ఆదివారం స్థానిక మాజీ సర్పంచ్ మాలోతు సుజాతా సక్రు నాయక్ పరిశీలించి మాట్లాడారు. కల్వర్టు కోసం ఎన్నోళ్లుగా కాల్వపల్లితండా, అల్లీపురం గ్రామ ప్రజలు ఎదురుచూశారని ఎట్టకేలకు నిర్మాణం పూర్తిగావచ్చిందన్నారు. ఈ నిర్మాణంతో రెండు గ్రామాల మధ్య దూరం తగ్గడంతో పాటు రహదారి సౌకర్యం ఏర్పడిందని హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట అల్లీపురం మాజీ సర్పంచ్ బోగాల పిచ్చిరెడ్డి, కొత్తతండా మాజీసర్పంచ్ విజయా బాలానాయక్, సక్రు, తదితరులు ఉన్నారు.

రామోజీరావు మృతి తీరనిలోటు


రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరనిలోటని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలో యూనియన్ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రామోజీరావు తెలుగు రాష్ట్రాలలో జర్నలిజాన్ని కొత్త పుంతలు తొక్కించారని కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.నరేందర్‌రెడ్డి, పి.శ్రీనివాస్, రాంప్రసాద్, జానీపాషా, భాస్కర్, రామకృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం


హుజూర్‌నగర్‌లో ఎస్టీయూ జెండాను ఆవిష్కరించిన నాయకులు


చిలుకూరు : జెండావిష్కరణ చేస్తున్న నాయకులు

చిలుకూరు : మండల కేంద్రంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ సంఘం పాత్ర ఎనలేనిదన్నారు. అనంతరం ఎస్టీయూ సంఘం సీనియర్ నాయకుడు గండెల అంజయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముందు ఉపాధ్యాయ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు దొడ్డా నారాయణరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు యలగొండ శ్రీను, సురగాని లింగయ్య, సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు కొండా వెంకయ్య, గుండు ఆదినారాయణ, ఖన్నంసాహెబ్ , కొండా ధనమూర్తి, కొండా రామాంజినేయులు, వీరబాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీను, సురేష్, శివరాంప్రసాద్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షెడ్యూల్‌కు ఆటంకం లేకుండా ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి

హుజూర్‌నగర్ : షెడ్యూల్‌కు ఎటువంటి ఆటంకం కలుగకుండా ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర నాయకుడు రామిశెట్టి శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రాంతీయ కార్యాలయ ఆవరణలో సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బడిబాటలో విద్యార్థుల నమోదు పెంచేందుకు, మెరుగైన విద్యను అందించేందకు ఎస్టీయూ కార్యకర్తలు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. బాధ్యతతో పనిచేసి, హక్కులకై ఉద్యమించే సంఘం ఎస్టీయూ అని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎం.మధుసూదన్‌రావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ ఎం.వెంకటరమణ, మండల నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు, టి.శివయ్య, కె.శ్రీనివాస్‌రావు, బి.గోవింద్‌నాయక్, వి.అన్నపూర్ణ, కె.వెంకటేశ్వరరావు, బి.గోవిందయ్య, పి.శ్రీనివాస్‌కుమార్, ఆర్.మంజునాథ్, శ్రీనివాస్, రామమూర్తి, నరసింహారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అనంతగిరి : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


గరిడేపల్లి : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అనంతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నాటి గురువులు హెచ్‌ఎం అమృతారెడ్డి, ఉపాధ్యాయులు నాళం హరికిషన్, శ్రీనివాసరెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడి నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. అంతేకాక తామంతా ఐక్యంగా ఉండాలని, తోటి స్నేహితులకు అండగా ఉండాలని అనుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల పరిధిలోని గడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1991–92 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 32సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఆత్మీయంగా పలుకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాడు పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని సంతోషంగా గడిపారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు ఎస్‌కె జానిమియా, వీరారెడ్డిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సీఐ సంద్యాల సైదులు, మాశెట్టి శ్రీహరి, సంద్యాల బక్కయ్య, బట్టిపల్లి శ్రీహరి, సలిగంటి నాగయ్య, జక్కి నర్సయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా మధు


మధుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కోదాడరూరల్ : తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా కోదాడ పట్టణానికి చెందిన కందుల మధు నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని తార్నాకలో గల రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మధును నియమించి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. అంబేద్కర్, పీవీ రావులు చూపిన మార్గంలో నడుస్తూ అణగారిన ప్రజల పక్షాన పోరాడాతానని ఆయన అన్నారు. సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని మధు తెలిపారు.

పుల్లయ్య సేవలు మరువలేనివి

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఇందిరాల పుల్లయ్య సేవలు మరువలేనివని ఆ పార్టీ నాయకులు అన్నారు. పుల్లయ్య ఆదివారం మృతి చెందడంతో ఆయన మృతదేహంపై ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాండు, డి.బ్రహ్మం, పి.హుస్సేన్, కౌన్సిలర్ త్రివేణి, సీపీఐ టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, యోన, వీరమల్లు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాలల భవనాలు

- ప్రారంభానికి ముందే స్వాగతం పలుకుతున్న సమస్యలు
- కొన్నేళ్లుగా భయపడుతూ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు
- అరకొర నిధులతో భవనాల మరమ్మతులు


శిథిలావస్థకు చేరిన గణపవరం పాఠశాల భవనం


పైకప్పు పెచ్చులూడిన తరగతి గదులు

కోదాడరూరల్ : ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభానికి ముందుకు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామని పాలకులు చెప్తున్నారనే కాని అవి ఎక్కడ అమలుకావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని పలు పాఠశాల్లో విద్యార్థులకు కావాల్సిన మరుగుదొడ్లు, మంచినీటి వసతులు అంతంత మాత్రమేగా ఉన్నాయి. మండలంలోని మంగళితండా పీఎస్, గుడిబండ ఉన్నత పాఠశాల, తొగర్రాయి పీఎస్, గణపవరం ఉన్నత పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా గణపవరం ఉన్నత పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణమైనా అనుకొని ప్రమాదం జరిగే విధంగా ఉంది. పాలకులు, అధికారులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్తున్నా మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. అందుకు నిదర్శనమే గణపవరం పాఠశాల. ఈ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఇటు విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా భయాందోళన నడుమ పాఠశాలకు వస్తున్న పరిస్థితి. అయితే అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఆయా పాఠశాలలకు అరకొర నిధులు మంజూరు కాగా వాటిలో తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తున్నారు.

1955లో గణపవరం పాఠశాల నిర్మాణం..

మండలంలోని గణపవరం పాఠశాల 1955లో ఆరు గదులతో నిర్మించారు. అప్పుడు నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడి మీదపడుతున్నాయి. అయినా ప్రభుత్వ పట్టించుకోకుండా అదే గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు ఉపాధ్యాయులు. మరికొన్ని తరగతులకు చెట్లకింద కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఇక వర్షాకాలం వచ్చిందటే విద్యార్థులు పాఠశాలకు బిక్కుబిక్కుమంటూ వస్తున్నారు. అయితే పాఠశాల నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

భవనాలకు మరమ్మతులు చేయిస్తున్నాం



మండలంలోని తొగర్రాయి, గుడిబండ, గణపవరం పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసి కలెక్టర్ నిధులను మంజూరు చేశారు. ఆ నిధులతో ఇప్పటికే మరమ్మతుల పనులను ప్రారంభించారు. పాఠశాలల ప్రారంభం నాటికి ఆ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

– ఎండీ.సలీంషరీఫ్, ఎంఈఓ, కోదాడ